

రైతులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి

ఆదిలాబాద్‌అర్బన్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి) : పత్తి రైతులు తమ పత్తిని ఎంఎస్‌పీకి విక్రయించేందుకు వీలుగా సీసీఐ ఆదిలాబాద్ 5 జిల్లాల్లో 24 కేంద్రాలను ప్రారంభించిందని డిప్యూటీ జనరల్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమీప కొనుగోలు కేంద్రాన్ని తెలుసుకోవడానికి, సంప్రదింపు వివరాలు, ఎంఎస్‌పీ రేట్లు, ఫిర్యాదుల పరిష్కారం, పత్తి రైతులు కాట్ ఆలీ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఇబ్బంది ఉన్నట్లయితే రైతులు ఆదిలాబాద్ శాఖను సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 77189 55728 వాట్సాప్‌నెంబర్‌కు సందేశాలు పంపవచ్చని తెలిపారు.



విదేశీ విద్యకు.. ఆదరణ కరువు!



- జిల్లాలో విద్యానిధి పథకానికి నామమాత్రంగానే దరఖాస్తులు
- నాలుగేళ్లలో ఐదుగురు విద్యార్థులకే అవకాశం
- ఇంగ్లీష్‌పై పట్టు, అవగాహన లేకపోవడమే ప్రధాన సమస్య
- తేలికగానే తీసుకుంటున్న సంక్షేమ శాఖ అధికారులు

ఆదిలాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో విదేశీ విద్యకు ఆదరణ అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు విదేశాల్లో ఉన్నత చదువులు చదివేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2013లో విద్యానిధి పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి, బీసీ విద్యార్థులకు మహాత్మాజ్యోతిబాపూలే, మైనార్టీలకు సీఎం ఓవర్సీస్ పేరుతో ఉన్నత చదువులకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. గడిచిన నాలుగేళ్లలో సుమారుగా 12 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా కేవలం ఐదుగురు విద్యార్థులకు మాత్రమే అవకాశం దక్కినట్లు తెలుస్తోంది. అర్హత సాధించేందుకు ఎలాంటి కఠిన నిబంధనలు లేకపోయినా విద్యార్థులకు అవగాహన లేక పోవడమే ప్రధాన సమస్యగా మారుతోంది. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే వారంతా వెనుకబడిన, మధ్య తరగతి, గ్రామీణ నిరుపేదలే కావడం, అలాగే ఇంగ్లీష్ భాషపై పెద్దగా పట్టు, నైపుణ్యం లేక పోవడంతో విదేశీ విద్యకు అర్హత సాధించలేక పోతున్నారు. దీనికి తోడు అధికారులు పథకం అమలుపై ప్రచారం, అవగాహన కల్పించక పోవడం కూడా మరో ప్రధాన సమస్యగా మారుతోంది. పథకం అమలు తీరు ఇంత అధ్వానంగా కనిపిస్తున్నా అధికారులు మాత్రం తేలికగానే తీసుకోవడంపై విమర్శలు వస్తున్నాయి.

అవగాహన కరువు

విదేశీ విద్యపై అవగాహన లేకపోవడంతో విద్యార్థులు ఆశించిన స్థాయిలో దరఖాస్తులు చేసుకోవడం లేదు. డిగ్రీలో 75 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి విదేశాలకు వెళ్లి ఉన్నత విద్య చదువుకోవాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం రూ.20లక్షల వరకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తుంది. కానీ అధికారుల అలస త్వం, విద్యార్థుల అవగాహన రాహిత్యంతో పథకా నికి స్పందన కరువవుతోంది. ప్రతీయేట నామమాత్రంగానే దరఖాస్తులు కనిపిస్తున్నాయి. అంబేద్కర్ ఓవర్సీస్ పథకానికి గడిచిన నాలుగేళ్లలో 5 దరఖాస్తులు రాగా ఒకరు మాత్రమే ఎంపికయ్యారు. అలాగే జ్యోతిబాపూలే, సీఎం ఓవర్సీస్ పథకాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. విద్యార్థులు ఆస్ట్రేలియా, అమెరికా, సింగాపూర్, కెనడా దేశాల్లో ఉన్నత చదువులు చదువుకునే అవకాశం ఉన్నా సద్వినియోగం చేసుకోవడం లేదు. దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించి జిల్లా విద్యార్థులకు ప్రభుత్వ ఆర్థిక ప్రోత్సాహం అందేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. అయితే ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల దరఖా స్తులకు పరిమితి లేకపోయిన బీసీ, మైనార్టీ విద్యార్థుల దరఖాస్తులకు పరిమితులు విధించినా అంతంత మాత్రంగానే దరఖాస్తులు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. అయితే కొన్ని నిబంధనలు సడలిస్తే బాగుంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రత్యేక శిక్షణ ఏదీ

గ్రామీణ ప్రాంతాల్లో చదువుకుంటున్న మధ్య తరగతి, నిరుపేద విద్యార్థులకు ఇంగ్లీష్‌పై పట్టు లేకపోవడం ప్రధాన సమస్యగా మారుతోంది. ఈ పథకానికి అర్హత సాధించాల ంటే వివిధ స్థాయిల్లో విద్యార్థులు తమ ప్రతిభను కనబర్చాల్సి ఉంటుంది. డిగ్రీలో 75శాతం మార్కు లతో పాటు జీఆర్ఈ, టోఫెల్, జీ-మాట్, ఐఈఎల్‌టీఎస్‌లో స్కోర్ చేయాల్సి ఉంటుంది. ఇలాంటి స్కిల్స్ లేకపో వడం పథక అమలుపై ప్రభావం పడుతోంది. అలాగే ఈ పథకంపై అవగాహన లేకపోవడంతో గ్రామీణ విద్యార్థులు కనీసం దరఖాస్తు చేసుకు నేందుకు ముందుకు రావడం లేదు. అలాగే చిన్నపాటి సమస్యలు ఉన్న అధికారులు దరఖాస్తులను తిరస్కరిస్తున్నట్లు తెలుస్తోంది. ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి ఎంపిక విధా నంపై అవగాహన కల్పించడంతో పాటు ముందస్తు శిక్షణ ఇస్తే అర్హులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు దక్కే అవకాశం ఉంటుంది. ఇతర పోటీ పరీక్షల మాదిరిగా విదేశీ విద్యపై ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తే బాగుంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలి

- సునీత, జిల్లా దళిత సంక్షేమ శాఖాధికారి

ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యానిధి పథకానికి దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. రెండేళ్ల కాల పరిమితి ఉన్న కోర్సులకే ఈ పథకం వర్తిస్తోంది. సంవత్సరం లోపు కోర్సులకు విద్యానిధి పథకం వర్తించదు. అలాగే ఏదైనా రెండు ఇంగ్లీష్ అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. దరఖాస్తు ప్రక్రియంతా పూర్తిగా ఆన్‌లైన్‌లోనే ఉంటుంది. ఏడాదిలో రెండు సార్లు ప్రభుత్వం దరఖాస్తులకు అవకాశం కల్పిస్తోంది. పత్రిక ముఖంగా ప్రకటనలు చేస్తూ శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నా గడిచిన నాలుగేళ్లలో నాలుగైదు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.

ట్రాక్టర్‌పై ఎమ్మెల్యే ప్రయాణం

- రోడ్డుసరిగ్గా లేక వైద్యులతో కలిసి ట్రాక్టర్‌పై వెళ్లిన ఖానాపూర్ ఎమ్మెల్యే
- ప్రత్యక్షంగా సమస్యలు తెలుసుకున్నవైనం



ట్రాక్టర్‌పై వైద్యసిబ్బందితో కలిసి ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్



ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌కు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉట్నూర్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగా పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న వంకతుమ్మ గిరిజనుల కష్టాలు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ నేరుగా తెలు సుకున్నారు. శనివారం ఏజెన్సీ వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరానికి తన వాహనంపై ఎమ్మెల్యే బొజ్జుపటేల్ గంగాపూర్ వంకతుమ్మ గ్రామాల మధ్య ఉన్న వాగు వరకు వెళ్లారు. కాని వాగులో నీరు ఉండడంతో పాటు బం డరాళ్లు అధికంగా ఉండడంతో ఎమ్మెల్యే వాహనం వాగుదాట లేకపోయింది. దీంతో వైద్య సిబ్బంది వెళ్తున్న ట్రాక్టర్లో ప్రయాణించి గ్రామానికి చేరుకున్నారు. దశాబ్దాలుగా వంకతుమ్మ పరిసర ప్రాంతాలలో ఉన్న రెండు గిరిజన గ్రామాల ప్రజలు ప్రతియేటా వర్షాకాలంలో అనేక కష్టాలు ఎదు ర్కొంటున్నారు. వర్షాకాలంలో ఏదైనా రోగాలు వస్తే కనీసం ఆసుపత్రికి కూడా వెళ్లలేక ఇబ్బం దులు పడుతున్న గిరిజనులు వారి కష్టాలను ఎమ్మెల్యేకు మొర పెట్టుకున్నారు. కాగా ప్రభుత్వం నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా టైగర్‌జోన్ ప్రాంతంలో ఉండడంతో రోడ్ల నిర్మాణానికి అడ్డంకులు వస్తున్నాయని ఎమ్మెల్యే విచారం వ్యక్తం చేశారు. వంకతుమ్మ గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఏజెన్సీ వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కుడుమిత మనోహర్, దంతనపల్లి డాక్టర్ కోవా అనురాధా, హస్నాపూర్ డాక్టర్ ఇఫ్తాత్‌ల ఆధ్వర్యంలో రోగు లకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. అలాగే ఈ సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ ఆరోగ్య పరీక్షలు వైద్య సిబ్బంది నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

- మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించగా ఎనిమిది అంశాలతో కూడిన అజెండాను ప్రవేశపెట్టారు. ఆయా అంశాల ప్రకారం సభ్యులు చర్చించారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను కౌన్సిల్ సభ్యులు సమావేశం దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కౌన్సిలర్ బండారి సతీష్ మాట్లాడుతూ పట్టణంలోని మిషన్ భగీరథ పనులు సక్రమంగా లేవని, పట్టణంలో నీటి సరఫరా సరిగా అవడం లేదని పేర్కొన్నారు. ఎల్‌ఈడీ లైట్లసరఫరా నిలిచి పోయిందని, టెండర్ రద్దుచేసి రూ.30 లక్షలతో లైట్లను కొనుగోలు చేయాలన్నారు. అదేవిధంగా పట్టణంలోని మున్సిపల్ అద్దెషాపులను తక్కువ ధరకు వేలం వేసి పట్టణ వాసులకు ఉపాధి కల్పించాలని మున్సిపాలిటీకి ఆదాయం వచ్చేలా చూడాలని కోరారు. పలువురు సభ్యులు వివిధ సమస్యలపై మాట్లాడారు. ఏడు అంశాలకు ఏకగ్రీవ ఆమోదం తెలపడంతో సమావేశం ముగిసింది.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్ మాట్లాడుతూ సమావేశంలో భాగంగా ప్రవేశపెట్టిన అజెండాలో ఏడు అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారని అన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి సరఫరాలో అంతరాయం తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం, సిబ్బంది అన్ని చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి కమిషనర్ తిరుపతి, ఆర్వోజాదవ్‌కృష్ణ, ఎస్సై నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

మామిడిగూడలో సౌకర్యాలు కల్పించాలి

ఉట్నూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మామిడిగూడ గ్రామంలో కనీస సౌకర్యాలు కల్పించాలని తుడందెబ్బ జిల్లాప్రధాన కార్య దర్శి పెందూరుపుష్పరాణి అన్నారు. కనీస సౌకర్యాలు కల్పించాలని ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తాని తుడందెబ్బ మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూరుపుష్పరాణి శనివారం కలిసి కోరారు. ఈ సందర్భంగా పెందూరు పుష్పరాణి మాట్లాడుతూ ఇంద్రవెల్లి మండలం హర్క పూర్ గ్రామ పంచాయతీ మామిడిగూడ(జీ) గ్రామంలో కనీసం తాగడానికి తాగునీరు లేక అక్కడి ప్రజలు చాలా ఇబ్బందికి గురవుతు న్నారని అదే విధంగా ఎప్పుడూ నడిచే ప్రాం తం కాబట్టి రోడ్డుసౌకర్యం కూడా లేక పోవడం చాలా దురదృష్టకరమైన పరిస్థితి అని అన్నా రు. పీవోని కలిసి గ్రామంలో ఒక బోర్ వేయా లని తాత్కాలిక రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామపటేల్ రాముతో కలిసి వినతి పత్రం సమర్పించారు. పీవో ఖుష్బుగుప్తా సానుకూలంగా స్పందించి తప్పకుండా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని పీవో తెలిపా రన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ విద్యార్థిసంఘం నాయకులు కోటేష్, గ్రామ ప్రజలు ఇంద్రుస, సంతోష్, ప్రభు, రామారావు, జుగాదిరావు, హిరామన్ తదితరులు పాల్గొ న్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



కేజీబీవీ విద్యార్థులకు దుప్పట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ గురుకుల బాట కార్యక్రమం చేపట్టాలన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశానుసారం శనివారం నేరడిగొండ మం డల కేంద్రంలో గల కేజీబీవీ పాఠశాలలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ గురుకులబాట చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంట గదిని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆహారం విషయంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, ఏ మాత్రం నాణ్యత తగ్గినా సహించేది లేదన్నారు. ప్రధాన అంశంగా గురుకుల విద్యార్థులు ఫుడ్‌పాయిజన్ వల్ల చనిపోతున్న దృష్ట్యా బీఆర్ఎస్ పార్టీ నేతలు రాష్ట్రంలో ఉన్న అన్ని గురుకులాల్లో గురుకుల బాట చేపడుతున్నారు. పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. ఏ సమస్య ఉన్నా తనను సంప్రదించాలన్నా రు. కార్యక్రమంలో పలు మండలాల నాయకులు, కార్యకర్తలు, ఎస్‌వో రజిత తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గంతోనే మానసిక ప్రశాంతత

- జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలా దేవి



పూజలు నిర్వహిస్తున్న శ్యామలాదేవి

తలమడుగు , నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక మార్గంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలా దేవి అన్నారు. శనివారం మండలంలోని బరంపూర్ కొండపై స్వయంభూగా వెలిసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అధ్యాత్మిక మార్గం అలవర్చుకోవాలని సూచించారు. నేటి శాస్త్ర సాంకేతికత యుగంలో మనిషికి ప్రశాంతత లేదన్నారు. అదేవిధంగా గత కొన్ని సంవత్స రాల నుంచి ప్రతి శనివారం వెయ్యిమందికి అన్నదానం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆలయం అభివృద్ధి కోసం కృషిచేస్తానని పేర్కొన్నారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షులు ముడుపు కేదారేశ్వర్‌రెడ్డి దంపతులు, అదనపు కలెక్టర్ శ్యామలదేవిని సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి స్వస్తిక్ స్వామి, కమిటీ సభ్యులు మల్లేష్, ప్రతాప్, రాజు, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- కలెక్టర్ రాజార్షిషా
- జిల్లా స్థాయి క్రీడా పోటీల ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు30 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, ఆ దిశగా వారిని ప్రోత్స హిం చాలని కలెక్టర్‌రాజార్షిషా అన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ వసతిగృహ విద్యార్థుల జిల్లాస్థాయి క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్ర మాలు నిర్వహించారు. శనివారం క్రీడాపో టీలకు అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముం దుగా క్రీడాకారులను పరిచయం చేసుకుంటూ జట్ల మధ్య టాస్‌వేసి పోటీలను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ గతంలో కేవలం రెసిడెన్షియల్ పాఠశాలల్లోనే క్రీడా పోటీలు జరిగేవన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బీసీ వెల్ఫేర్ వసతి గృహాల్లో కూడా క్రీడా పోటీలు నిర్వ హించడం సంతోషకరమన్నారు. ఈ పోటీలతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలతో పాటు క్రమశిక్షణ, పోటీ తత్వం పెరుగుతుందన్నారు. దీని ద్వారా వీరు భవిష్యత్తులో రాణించే అవకా శాలుంటాయ న్నారు. అదేవిధంగా ప్రభుత్వం ఇటీవల డైట్‌చార్జీలను పెంచడం పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తు న్నారన్నారు. విద్యార్థులకు మంచి భోజనం అందించేందుకు గాను ప్రభుత్వం ఫుడ్‌సేఫ్టీ కమి టీలను ఆయా విద్యాసంస్థల్లో నియమిం చిందన్నారు. త్వరలో వంట మనిషితో పాటు నర్సు, ఉపాధ్యాయులకు ఆహారభద్రత అధికారు లతో శిక్షణలు ఇస్తామన్నారు. రుచి, పరిశుభ్రత ఆహారం ఎలా అందించాలో వివరిస్తారన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి రాజలింగు, డీవైఎస్‌వో వెంక టేశ్వర్లు, వసతి గృహాల పీఈటీలు, పీడీలు, కోచ్‌లు పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు



ఖోఖో ఆడుతున్న విద్యార్థినులు

రైతు పండుగను వీక్షించిన నాయకులు

తలమడుగు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలో శనివారం నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి రైతు పండుగ కార్యక్రమం ఆన్‌లైన్‌లో టెలికాస్ట్ కాగా మండలంలోని బరంపూర్ రైతువేదికలో మండల ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు వీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడి సం వత్సరం అవుతున్న సందర్భంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రతిఒక్కరికీ అందే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషిచేయాలని సూచించారు. ఇందులో సహకార సంఘం చైర్మన్ దామోదర్‌రెడ్డి, దరి, సంఘం చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గణేష్‌రెడ్డి, బాపన్న, మండల వ్యవసాయ అధి కారి ప్రమోద్‌రెడ్డి, ఏఈవోలు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రెడ్డి సంఘం నాయకులు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

బోథ్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కౌటా (బీ) గ్రామానికి చెందిన రెడ్డి సంఘం అధ్యక్షులు పురుషోత్తం రెడ్డితో పాటు పలువురు శనివారం సాధన సభ్యులు జాదవ్ అనిల్‌ను కలిశారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం సమస్యను ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమంలో పలువురు రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

'ఉచిత విద్య, వైద్యం అందించాలి'


వినతిపత్రం ఇస్తున్న డీఎస్పీ నాయకులు

బోథ్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ ఉచిత నాణ్యమైన విద్యను అందించాలని కేజీ నుంచి పీజీ వరకు పేదలందరికీ ఉచితంగా విద్య అందించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు వెంకటేష్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట డీఎస్పీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్ర మంలో డీఎస్పీ మండల ఉపాధ్యక్షులు కందుకూరి సుధాకర్, ప్రధానకార్యదర్శి బిక్కు రమేష్ రాథోడ్, నరేందర్, రజక సంఘం నాయకులు నరేష్, డ్రైవర్ యూనియన్ అధ్యక్షులు సుభాష్, శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని నిరసన

బోథ్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ఆదర్శ పాఠశాల ఎదుట ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు మున్సిఫ్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఎంతో మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రేమ్, శ్రీకాంత్, సంతోష్, రాంప్రసాద్, ప్రకాష్, దినేష్ తదితరులు ఉన్నారు.

'కంటి జాగ్రత్తలు పాటించాలి'

బోథ్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కళ్లను నిర్లక్ష్యం చేస్తే కంటి చూపు కోల్పోవాల్సి వస్తుందని ఎల్వీప్రసాద్, ఆదిలాబాద్ జిల్లా కో-ఆర్డినేటర్ సిరిగాది వెంకటరమణ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎల్వీప్రసాద్ కంటి వైద్య కేంద్రంలో 19వ వార్షికోత్సవ వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో హలో టెక్నీ షియన్లు కృష్ణ, గోపాల్, మాజీసర్పంచ్ సురేందర్ యాదవ్, రమేష్‌రెడ్డి, రమణ గౌడ్, సందీప్, సంతోష్, తిరుమల్ మహేష్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు సైబర్‌క్రైమ్ పై అవగాహన

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : 32 బెటాలియన్ ఎన్‌సీసీ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో డీటీసీలో నిర్వహిస్తున్న క్యాంప్‌లో శనివారం క్యాడెట్లకు సైబర్‌క్రైమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సైబర్‌క్రైమ్ ఇన్‌చార్జీ సంతోష్ పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనుమానిత కాల్స్ వస్తే వ్యక్తిగత సమాచారం ఇవ్వవద్దని సూచించారు.

పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలి

● జిల్లా కలెక్టర్ రాజార్షిషా
● అధికారులతో సమావేశం

ఆదిలాబాద్ అర్బన్, నవంబర 30 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న డబుల్‌బెడ్‌రూమ్ నిర్మాణాలను పూర్తి చేయాలని కలెక్టర్ రాజార్షిషా అధికారులకు సూచించారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలను పూర్తి చేయాలని, పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. డబుల్‌బెడ్‌రూమ్ హౌజింగ్ స్కీమ్ లబ్ధిదారులను ఖరారు చేయడానికి ఎంపిక ప్రక్రియను సమీక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లోని 567 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను ఖరారు చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి రూ.3.40 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈఈ (పీఆర్) మౌలిక సదుపాయాల కోసం ప్రతిపాదనలను సమర్పించాలని, ఎగ్జిక్యూటింగ్ ఏజెన్సీ నుంచి ప్రతిపాదనలు అందిన వెంటనే సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీకి అడ్మినిస్ట్రేటివ్ అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ తహసీల్దార్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

సీఎం కప్‌పై సమావేశం..

జిల్లా స్థాయి కమిటీ సీఎం కప్-2024 విస్తృత సమన్వయ సమావేశాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి చైర్మన్, జిల్లా కలెక్టర్ రాజార్షిషా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ జిల్లా కలెక్టర్ సీఎం కప్-2024పై విస్తృతంగా గ్రామ పంచాయతీ, మండల, జిల్లాస్థాయి నిర్వహించాలని తేదీలను తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లాస్థాయి చైర్మన్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అదనపు ఎస్పీ, డీఎస్పీ, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు, వివిధ ఒలంపిక్ అసోసియేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

సంస్మరణ సభను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు పూర్కా చిత్రు

ఇంద్రవెల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఉద్యమ నేత ఉచిక సంజీవ్ అకాలమరణం యావత్ ఆదివాసీ సమాజానికి, ఉద్యమానికి తీరని లోటు అని తుడుం దెబ్బ మండల అధ్యక్షులు పూర్కాచిత్రు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆదివాసి సంఘాల నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం ఉట్నూర్ మండలంలోని ఆదివాసీ ఉద్యమనేత సంజీవ్ సంస్మరణ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సంస్మరణ సభకు ఆదివాసులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్ర మంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు సోయం రాందాస్, జిల్లా కార్యదర్శి గేడం భారత్, మండల ప్రధాన కార్యదర్శి సోయం మురారి, కోశాధికారి మెస్రం జై రామ్, మండల విద్యార్థి సంఘం అధ్యక్షులు కొత్లే పృథ్వీరాజ్, పెందోర్ అంకుష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

గుడిహత్నూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అంగన్ వాడీల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్, జిల్లా ప్రధాన కార్య దర్శి సిర్ర దేవేందర్‌లు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ మండల సమా వేశం నిర్వహించారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌తో అనేక సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభు త్వం అంగన్‌వాడీ కార్మికులను మోసం చేసిందని ప్రజాపాలన ప్రభు త్వం పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఎన్నికల ముందు అంగన్‌వాడీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు కనీసం 18 వేల రూపాయల వేతనాలు ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలన్నారు. రిటైర్మెంట్ అయిన అంగన్ వాడీ టీచర్లకు రెండు లక్షల రూపాయలు, ఆయాలకు లక్ష రూపాయలు రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలన్నారు. వెంటనే ముఖ్యమంత్రి అంగన్‌వాడీల పట్ల దృష్టిసారించి న్యాయం చేయాలన్నారు. డిమాండ్లను పరిష్కరించకపోతే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో మండలంలోని ఆయా అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లాహుజీసాల్వే కృషి మరువలేనిది

● మాజీ మంత్రి జోగురామన్న

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సమాజం, దేశం కోసం క్రాంతివీర్ లాహుజీ సాల్వే చేసిన కృషి మరువలేనిదని, ఆయన ఆచరణలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. శనివారం లాహుజీ సాల్వేచౌక్‌లో లాహుజీ సాల్వే జయంతిని నిర్వహించారు. దీనికి మాజీమంత్రి ముఖ్య అతిథిగా హాజరై సాల్వేతో పాటు అన్నబావుసాఠే చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి జోగురామన్న మాట్లాడుతూ దేశంలోని అన్ని జాతులను ఐక్యం చేసిన మహనీయుడు లాహుజీ సాల్వే అని కొనియాడారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమం, అభ్యున్నతితో పాటు దేశం కోసం పోరాడారని గుర్తుచేశారు. ఇతర కులాలు, జాతులకు ఆయన ఇచ్చిన సందేశాలను పాటిస్తూ ముందుకు సాగాలన్నారు. ప్రతిఒక్కరూ సాల్వే ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో లాహుజీశక్తి సేన రాష్ట్రఅధ్యక్షుడు వాసుదేవ్‌లాంటిలే, అన్నబావు సాఠే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగ్‌మోరే, రణదివేనగర్, బంగారిగూడ అధ్యక్షులు శ్యాంరావ్, రాజు, తెలంగాణ మతంగ్ శక్తి జిల్లా అధ్యక్షుడు, నాయకులు రాజ్‌కుమార్, పండరిసూర్యవంశీ, దత్త రాజ్‌దేవ్‌కాంబ్లె పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

ఉట్నూర్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): అటవీ అధికారుల నిర్లక్ష్యం వల్లనే పులిదాడిలో యువతి మృతిచెందిందని యువతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ సిడాం జంగుదేవ్ విలేకరులతో డిమాండ్ చేశారు. అటవీ అధికారుల నిర్లక్ష్యం వల్లనే పులిదాడికి యువతి బలైందన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని బెంగాలి క్యాంపునకు చెందిన యువతిని పులిదాడి చేసి చంపివేయడం దారుణమన్నారు. ఆవులు, దూడలు, పశువులు కాపరులు, పంట చేన్లలో కూలీలకు రక్షణ కల్పించాలని ఆదివాసీ విద్యార్థి సంఘం డిమాండ్ చేస్తున్నదన్నారు. ఆయన వెంట పెందూరు, మోతిరాం, జిల్లా కోకన్వీనర్ పెందూరు, జనర్ధర్, జంగుపటేల్, భీంరావ్, రావి,జుగాదిరావు, అర్జున్ తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల బంద్

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఫుడ్‌పాయిజన్ ఘటనలను ఖండిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ పాఠశాలల బంద్ చేపట్టారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలోని గెజిటెడ్ నెంబర్.1 ఉన్నత పాఠశాలకు వెళ్లి వామపక్ష విద్యార్థి సంఘాల బంద్ చేయించారు. సంఘం నాయకులు గణేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. పీడీఎస్‌యూ నాయకులు మడావి గణేష్, మహేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు కోట్నక్ సక్కు, యూఎస్ఎఫ్ఐ నగేష్, అశోక్, భీమేష్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నేరడిగొండ మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన బొజ్జవ్వకు రూ.28,500, బుద్ధికొండ గ్రామానికి చెందిన సౌజన్యకు రూ.24వేలు మంజూరైన చెక్కులను శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ నేరడిగొండలోని తన నివాసంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సజన్, మాజీ ఎంపీటీసీ పందరి పాల్గొన్నారు.

సోనాలలో ప్రజాపాలన రైతు పండుగ వేడుకలు


రైతుపండుగ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

బోథ్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోనాల గ్రామంలో శనివారం రైతుపండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాజులపోతన్న మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నిధుల కొరత ఉన్న రైతాంగానికి రుణమాఫీతో పాటు పేదప్రజలకు గతంలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ లను నెరవేరుస్తూ వచ్చిందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలుతో పాటు రెండు లక్షల రుణమాఫీ సైతం సంక్రాంతి కానుకగా రైతులకు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అమృతరావు, పార్టీ సీనియర్ నాయకులు గంగారెడ్డి, యశ్వంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'గురుకులాల్లో మెరుగైన వసతులు'

బోథ్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో గురుకు లాలలో విద్యార్థులకు మెరు గైన వసతులు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసు లచంటి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన బోథ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చాలీచాలని మెస్ చార్జీలు ఇవ్వడం జరిగిందని, ఈసారి 70 శాతం మెస్‌చార్జీలను పెంచడం జరి గిందన్నారు. సకల సౌకర్యాలతో రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్వ హిస్తున్నామన్నారు. సిబ్బంది లేకుండా నిర్వీర్యం చేసిన ఘనత గత పాలకులదన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఎమ్మెల్యే విమర్శలు చేయడం సరికాదన్నారు. గురుకుల అభివృద్ధి, విద్యా సంస్థల అభివృద్ధిపైన ఎమ్మెల్యే చర్చకు సిద్దంగా ఉండాలని, అం దుకు అంబేద్కర్ విగ్రహం వేదికగా చర్చిద్దాం అని సవాల్ విసిరారు.

వివాహిత మృతి

ఇంద్రవెల్లి , నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వాంతులు, విరోచనాలతో వివాహిత మృతిచెందిన సంఘటన మండలంలోని మెండపల్లి గ్రామంలో జరిగింది. మృతురాలి మామ కొడప శ్రీరాం తెలిపిన వివరాల ప్రకారం... మెండపల్లి చెందిన కొడప తిరుమల (25) అనే వివాహిత శుక్రవారం రాత్రి వాంతులు, విరేచనాలతో బాధపడుతుండటంతో ఆమెకు కుటుంబసభ్యులు ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి, మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలికి భర్త కొడప నాగోరావు తదితరులున్నారు.

విద్యార్థుల్లో సామాజిక బాధ్యత ఉండాలి

● బాసర ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్


ఎన్ఎస్ఎస్ ఓరియంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

బాసర, నవంబర్, 30 : (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని బాసర ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. శనివారం క్యాంపస్‌లో నూతన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వైస్ చాన్సలర్ మాట్లాడుతూ యువతలో సామాజిక బాధ్యత, సానుభూతి , సమాజానికి సేవ చేయాలనే భావన పెంపొందించడం ఎన్ఎస్ఎస్ లక్ష్యమని అన్నారు. కొత్తవాలంటీర్లు కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. మిగితా తోటి విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ గురించి అవగాహన కల్పించి సానుకూల ప్రభావం చూపేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళి దర్శన్ యువతను తీర్చిదిద్దడంలో ఎన్ఎస్ఎస్ ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థి రోజుల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీరుగా పనిచేసిన తన అనుభావాలను విద్యార్థులతో పంచుకున్నారు. అడ్మినిస్ట్రేటివ్ అధికారి రణధీర్ సాగి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో అభివృద్ధికి ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తీసుకోవాల్సిన బాధ్యత గురించి తెలియజేశారు. ఆర్జీయూకేటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ చేపట్టిన వివిధ కార్యక్రమాలను, ప్రాజెక్టులను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.రాకేష్‌రెడ్డి, ప్రోగ్రాం అధికారులు రమాదేవి, రాములు, విజయ్ కుమార్, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



డ్రగ్ నివారణ పోస్టర్‌ను విడుదల చేస్తున్న అధికారులు

డ్రగ్ నివారణ పోస్టర్ విడుదల

ఆర్జీయూకేటీలో విద్యార్థుల అవగాహన కోసం డ్రగ్ నివారణ పోస్టర్‌ను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ శనివారం విడుదల చేశారు. డ్రగ్స్‌కు బానిసైతే జీవితం వినాశమని వైస్ చాన్సలర్ వ్యాఖ్యానించారు. అందుకే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం

పెంబి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధమైన సంఘటన మండలంలోని కోరికంటి తండా గ్రామంలో చోటుచేసుకుంది. కోరికంటి గ్రామానికి చెందిన జాదవ్ ఇందల్ అనే రైతు పత్తి ఇంటి లోపల నిల్వ ఉంచగా షార్ట్ సర్క్యూట్‌తో 7 క్వింటాళ్ల పత్తి దగ్ధమైనట్లు తెలిపారు. అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరారు.

సీఎం ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నరైతులు

దిలావర్‌పూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వ విజయోత్సవాల్లో భాగంగా మండలంలోని బన్సపల్లి రైతువేదికలో రైతు పండుగ నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు మహబూబ్ నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని టీవీలో ఆసక్తిగా విన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పీవీ రమణారెడ్డి, మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్‌రెడ్డి, ఏఈవో మౌనిక, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే రైతులకు న్యాయం

కుంటాల, నవంబర్, 30 : (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీతోనే రైతులకు న్యాయం చేకూరుతుందని పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం అన్నారు. శనివారం కుంటాల రైతువేదికలో ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం ప్రవేశ పెట్టనటువంటి పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని రైతులు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహబూబ్ నగర్ జిల్లా నుంచి రైతులను ఉద్దేశించి ప్రసంగించగా తిలకించారు. ఈ కార్యక్రమంలో డీపీవో శ్రీనివాస్, ఏడీఏ వీణ, ఎంపీడీవో లింబాద్రి, ఏఈవోలు రైతులు ఉన్నారు.

అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు

సోన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోత) : ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేస్తేనే సమాజంలో గుర్తింపు పొందుతారని మండల విద్యాధికారి తోడిశెట్టి పరమేశ్వర్ అన్నారు. ఉద్యోగ విరమణ చెందిన చింత ముత్తన్నను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, గ్రామస్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ అధ్యాపకుడికి డాక్టరేట్


వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ వద్ద డాక్టరేట్ పత్రంతో అధ్యాపకుడు

బాసర, నవంబర్, 30 (ఆంధ్రజ్యోతి) : ఆర్జీయూకేటీలో ఈసీఈ విభాగంలో సహాయ ఆచార్యునిగా విధులు నిర్వహిస్తున్న జీవీఎస్‌కే ఆర్ నాగాంజనేయులుకు నేషనల్ ఇనిస్ట్యుట్ ఆఫ్ టెక్నాలజీ కర్నాటక, డెవలప్‌మెంట్ ఆఫ్ స్మార్ట్ స్ట్రాటజీస్ అండ్ డివైసెస్ ఫర్ టెక్నికల్ ఎనాలసిస్ ఇన్ వేరియస్ మార్కెట్ పారాడైమ్స్ పై పరిశోధనకుగాను డాక్టరేట్ డిగ్రీ ప్రధానం చేసింది. ఈ సందర్భంగా శనివారం ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ఆచార్య గోవర్ధన్ అభినందనలు తెలిపారు.

తల్లిదండ్రులకు విద్యార్థి అప్పగింత




నర్సాపూర్(జి), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి తెల్లవారు జామున మూడు గంటల ప్రాంతంలో కుంటాల మండలం కల్లూర్‌లోని ఎస్ఎంఎస్ నవోయద కోచింగ్ సెంటర్ నుంచి తొమ్మిది సంవత్సరాల బాలుడు గోడ దూకి తన గ్రామమైన బోస్రాంకు ఎన్‌హెచ్-61 మీదుగా నడుచు కుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో విధులు నిర్వహిస్తున్న నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్ పెట్రోకార్ సిబ్బంది సంజీవ్, వినోద్‌లు ఆ బాలుడిని గమనించి పేరు, వివరాలు తెలుసుకొని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. బాలుడి కుటుంబ సభ్యులు పోలీసుస్టేషన్‌కి రాగా నర్సాపూర్(జి) ఎస్సై హన్మాండ్లు కౌన్సిలింగ్ చేసి బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కలెక్టర్ ఆదేశాలతో కదిలిన అధికారులు

● నిర్మల్ జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు ● మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇవ్వాలని సూచనలు


సమావేశంలో పాల్గొన్న హెచ్ఎంలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీవో గోవర్ధన్

దిలావర్‌పూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ విద్యార్థులకు ఇచ్చే భోజనం విషయంలో కఠినంగా వ్యవహరిస్తుండటంతో అధికారుల్లో కదలిక మొదలైంది. హాస్టళ్లను, కేజీబీవీలను, ప్రభుత్వ పాఠశాలల్లో విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశంతో శనివారం ఎంపీవో గోవర్ధన్ మండల కేంద్రంలోని కేజీబీవీని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. స్టోర్‌రూమ్‌తో పాటు వంట గదిని పరిశీలించారు. పాడైపోయిన వస్తువులను వంటలో ఉపయోగించవద్దని సూచించారు. తాజా కూరగాయలు, ఆకుకూరలను వాడాలన్నారు. వంట గదిని పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. మెనూను తప్పకుండా పాటించాలని లేదంటే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. వాష్ ఏరియా, కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం కేజీబీవీ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఎంపీవోతో పాటు ఈవో చంద్రశేఖర్, స్పెషల్ ఆఫీసర్ అపర్ణ ఉన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని ఎంపీవో గోవర్ధన్ అన్నారు. దిలావర్‌పూర్ ఉన్నత పాఠశాలలో శనివారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యా యులు, సంక్షేమ హాస్టళ్ల వెల్ఫేర్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. తప్పనిసరిగా సరిగా మెనూ పాటించాలన్నారు. వంట చేస్తున్నప్పుడు కూరగాయలు, ఆకుకూరలు తాజాగా ఉన్నాయా... లేదా అనేది గమనించాలన్నారు. పప్పులు, ఇతర దినుసులు నాణ్యమైనవా కాదా పరిశీలించాలన్నారు. వంటగది, వంట పాత్రలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ప్రధానోపాధ్యాయుడు సదానందం పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి


మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

కుంటాల, నవంబర్, 30: (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో, గురుకులాల్లో విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకుంటూ నాణ్యమైన భోజనాన్ని అందించాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రం కుంటాల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్‌లు, పంచాయతీ సెక్రటరీలకు పాఠశాలలో మధ్యాహ్న భోజనంపై అవగాహన కల్పించారు. గురుకులాల్లో, పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతిరోజు నాణ్యమైన పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని, శుద్ధజలాన్ని త్రాగునీరుగా అందించాలని సూచించారు. ప్రతిరోజు వంటగదితో పాటు పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ భోజనం వండిన తర్వాత ప్రిన్సిపల్‌లు, ప్రధానోపాధ్యాయులు భోజనం చేసిన తర్వాత పిల్లలకు అందించాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విద్యార్థులకు అందించే భోజనంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లింబాద్రి, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్, ఎంపీవో రహీం, ఎంఈవో ముత్యం, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ సెక్రటరీలు, ప్రిన్సిపల్‌లు ఉన్నారు.

ప్రతి పాఠశాలల్లో ఆహార భద్రత కమిటీలను ఏర్పాటు చేసుకోవాలి

లోకేశ్వరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగుచర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారి బి. చంద్రకాంత్, ఎంపీడీవో రమేష్, ఎంపీవో సల్మాన్‌రాజ్‌లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడారు. పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం, వాటి నిర్వహణ గురించి మధ్యాహ్న భోజన కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో అక్కడక్కడ జరుగుతున్న ఫుడ్ పాయిజన్ కేసులను దృష్టిలో ఉంచుకొని తగు జాగ్రత్తలు పాటిస్తూ మెరుగైన, పౌష్టికరమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. అందుకు అనుగుణంగా వంటిగది పరిసర ప్రాంతం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నాణ్యమైన సరుకులు, పప్పు దినుసులు, నూనె, పలు సామాగ్రి, తాజా కూరగాయలు ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని పాఠశాలల ప్రధానోపా. ధ్యాయులు, సీఆర్పీ సునీత, ప్రవళిక, కంప్యూటర్ ఆపరేటర్ భోజన్న, మండల కోఆర్డినేటర్ భూషణ్, వసంత, లక్ష్మీ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధి పనుల బిల్లులను వెంటనే మంజూరు చేయాలి

పెంబి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ అభివృద్ధి పనుల బిల్లులను వెంటనే మంజూరు చేయాలని సీపీఎం నిర్మల్ జిల్లా కమిటీ సభ్యులు శంభు అన్నారు. ఇటీవల గ్రామ పంచాయతీ బిల్లులు రాక పెంబి మాజీ సర్పంచ్ శేఖర్ గౌడ్ ఆత్మహత్యాయత్నం చేసుకోవడంతో నిర్మల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శేఖర్‌గౌడ్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అభివృద్ధి పనుల కోసం అప్పు చేసి పనులు చేస్తే బిల్లులు రాక మాజీ సర్పంచ్‌లు చాలా ఇబ్బంది పడుతున్నారని, పనులు పూర్తయినా ఇంకా బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీ అభివృద్ధిని ప్రోత్సహించాలింది పోయి బిల్లులు విడుదల అలస్యం చేయడం వల్ల ప్రజా ప్రతినిధులు మానసిక వేదనతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి బిల్లులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సభ్యులు పోశెట్టి, ఆనంద్ రావు, తదితరులు ఉన్నారు.

కనువిందు చేస్తున్న కోసాయి ప్రకృతి అందాలు

● దట్టమైన కొండల మధ్య చుక్ చుక్ రైలు కూతలు..

తలమడుగు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దట్టమైన కొండలు.. కొండల మధ్య పల్లెలు, పక్షుల కూతలు, నాట్య మాడే మయూరి అందాలు కనుచూపుమేరా.. పచ్చని చెట్లు.. చెట్ల మధ్యన ఆదివాసీల అందమైన ఇల్లు.. ఓ పక్క చుట్టూ కొండలు వాటి చుట్టూ పచ్చని దట్టమైన అడవి, చెట్ల మధ్య లో రైలు పట్టాలు అల్లంత దూరం నుంచి చుక్ చుక్ మంటూ రైలు కూతలు పెడుతూ పట్టాలపై నుంచి పరుగులు పెడుతున్న ఈ అందమైన దృశ్యం మహారాష్ట్ర తెలంగాణ సరిహద్దులో ఉన్న ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం కోసాయి ఆదివాసీ గిరిజన గూడెం శివారులోని దృశ్యం. ఈ అందమైన దృశ్యాన్ని వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ తన కెమెరాల్లో బంధించాడు. ఈ ప్రకటి అందాలను చూసేందుకు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది ప్రకృతి ప్రేమికులు వచ్చి అస్వాదిస్తారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే ఊటీ, కోడై కెనాల్, లంబ సాంగి వంటి సుందర దృశ్యాలను మన ఆదిలాబాద్ జిల్లాలో చూడవచ్చు.

రెండు దట్టమైన కొండల మధ్య నుంచి వస్తున్న రైలు బండి



ఫోటో న్యూస్



దట్టమైన అడవి మధ్యలో ఆదివాసీ కోసాయి గ్రామం



కొండల మధ్య నుంచి నిప్పులు చిమ్ముకుంటూ ఉదయిస్తున్న సూర్యుడు



దట్టమైన అడవి నుంచి పొగమంచు మధ్య వెళుతున్న రైలు బండి

ఆస్పత్రి గోడకు పెరిగిన మొక్కలు

● చొచ్చుకు వచ్చిన వేర్లతో భవనానికి పగుళ్లు

ఆంధ్రజ్యోతి పరిశీలన

భైంసా, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి ఏరియా ఆసుపత్రి నిర్వాహణాధికారులు అవలంభించిన చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగా ఆసుపత్రి భవనం గోడ ఒకటి పగుళ్లు తేలిపోయి ప్రమాదకర స్థితికి చేరుకుంది. ఆసుపత్రి వెనుక వైపు గోడకు ఒక చిన్న పాటి రావి మొక్క మొలిసింది. మొక్కే కదా అని దానిని వదిలి వేయడంతో అది కాస్తా ఇప్పుడు ఇంతింతై వటుడింతై అన్నట్లుగా వృక్షంగా ఎదిగింది. గ్రౌండ్ ఫ్లోర్ భాగంలో మొలకెత్తిన రావి మొలక రోజు రోజుకు బలిష్టంగా మారుతూ మొదటి ఫ్లోర్‌ను దాటి పై భాగం వరకు పెరిగిపోయింది. రావి మొక్క వృక్షంగా ఎదగడంతో దానికి సంబంధించిన వేర్లు గోడలోకి చొచ్చుకుంటూ విస్తరించి పోయాయి. ఈ కారణంగా గోడ పగుళ్లు తేలుతోంది. పగుళ్లలో ఆసుపత్రిలోని లీకేజీ నీరు పోతూ అక్కడి గోడ బాగమంతా నానిపోయి ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ఇదే పరిస్థితి మరి కొన్నాళ్లు యదావిధిగా కొనసాగిస్తే గోడ కూలిపోయే పరిస్థితులున్నాయి. ఏరియా ఆసుపత్రి నిర్వాహణాధికారులు ఇకనైనా స్పందించి ప్రమాదకర పరిస్థితులకు కారణంగా నిలుస్తున్న రావి వృక్షాన్ని తొలగించి తదుపరి సమస్యలు ఏర్పడకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఆస్పత్రి గోడకు పెరిగిన రావి మొక్క



గోడలోకి చొచ్చుక వచ్చిన వేర్లు

పెద్ద పులి సంచారంతో భయం భయం



పులి అడుగుజాడలు వెతుకుతున్న అటవీ శాఖ అధికారులు

సారంగాపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం కౌట్ల(బి), శాంతినగర్ తండా సమీపంలో గల అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచరించడంతో తండా ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. శాంతి నగర్ తండా ప్రజలు అటవీ శాఖ అధికారులకు సమాచారాన్ని అందించడం వల్ల వెంటనే అటవీ శాఖ అధికారి నజీర్ ఖాన్ సిబ్బందితో అటవీ ప్రాంతానికి చేరుకొని పులి సంచరిస్తున్న ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టి ప్రజలను అప్రమత్తం చేశారు. దీంతో పాటు అటవీ ప్రాంత సమీపంలో ఉన్నటువంటి గ్రామస్థులకు అటవీ శాఖ అధికారులు పెద్ద పులి సంచారంపై అవగాహన కల్పించి గ్రామస్థులకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండల వాసులు రాత్రి సమయంలో ఇతర పనులపై బయటకు వెళ్లే సమయంలో అర చేతిలో ప్రాణాలను పెట్టుకొని వస్తున్నట్లు అధికారులతో పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు శాంతినగర్ అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న పెద్దపులిని ఈ పరిసరాల నుంచి తరలిపోయేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

బస్టాండ్ లేక తప్పని ఇక్కట్లు

● ప్రయాణికులకు మర్రి చెట్టే ఆధారం..
● బస్టాండ్ నిర్మాణం హామీలకే పరిమితం..

జర దేఖో!!



తలమడుగులో బస్టాండ్ లేక చెట్ల కిందనే బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

తలమడుగు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండల కేంద్రంలో బస్టాండ్ లేక ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. బస్టాండ్ నిర్మాణం కోసం ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు హామీలు ఇస్తున్నారే తప్పా ఇప్పటి వరకు బస్టాండ్ నిర్మాణం కోసం ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో గల ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ గ్రామాల నుంచి ప్రతీరోజు వందల సంఖ్యలో ప్రయాణికులు వస్తున్నారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన ప్రయాణికులు వివిధ గ్రామాలకు దూర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సు ల కోసం బస్టాండ్ ప్రాంతానికి వచ్చి చెట్ల కింద, హోటల్‌లలో, ప్రభుత్వ కార్యాలయంలో బస్సుల కోసం ఇతర వాహనాల కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా ప్రయాణికులు వానకు తడుస్తూ, ఎండకు ఎండుతూ చలికి వణుకుతూ చెట్ల కిందనే బస్సుల కోసం ఎదురు చూడా ల్సిన పరిస్థితిలు ఏర్పడుతున్నాయి. అంతేకాకుండా మహిళలకు బస్టాండ్ ప్రాంతంలో మరు గుదొడ్లు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో బస్టాండ్ నిర్మాణం కోసం గ్రామస్థులు స్థలాన్ని కొనుగోలు చేసినప్పటికీ ఇప్పటి వరకు బస్టాండ్ నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని పలుమార్లు గ్రామస్తులు ప్రజాప్రతినిధు లకు, అధికారులకు విన్నవించారు కాని హామీలు ఇస్తున్నారు తప్ప బస్టాండ్ నిర్మాణం కోసం ఎలాంటి నిధులు మంజూరు చేయ లేదని విమర్శలు వ్యక్త మవుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి బస్టాండ్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని మండల వాసులు కోరుతున్నారు. అదే విధంగా మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలకు ఒకటి బస్సు నడవడంతో గ్రామీణ ప్రజలకు ఉన్నత చదువుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు బస్సులు సరిపోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి మరిన్ని బస్సుల సంఖ్య పెంచాలని గిరిజన వాసులు కోరుతున్నారు. అదేవిధంగా మండల కేంద్రానికి ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

● బస్టాండ్ లేక ఇబ్బందులు పడుతున్నాం



మండల కేంద్రంలో బస్టాండ్ లేక పోవడంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. వానకు తడుస్తూ, ఎండకు ఎండుతూ గంటల తరబడి బస్సుల కోసం చెట్ల కిందనే ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నప్పటికీ సమయానికి బస్సులు రావడం లేదు. మరింతగా బస్సుల సంఖ్య పెంచాలి.

- సునీతారెడ్డి, ప్రయాణికురాలు

నష్టాల్లో పత్తి రైతు

● ఎకరాకు ఆరు క్వింటాళ్లు కూడా కష్టమే ● ఆందోళనలో రైతులు

తాంసి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడు పత్తి పంట అన్నదాతను నట్టేట ముంచిందని చెప్పాలి. మొదట్లో అనుకూలంగా వర్షాలు కురిసినప్పటికీ గత రెండు మాసాల నుంచి వర్షాలు మొండికేశాయి. దీంతో పత్తి రైతు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ఈ ఏడు తెగుళ్లు అంతంత మాత్రమే అయినప్పటికీ వర్షాలు కురియకపోవడంతో ఆశించిన స్థాయిలో పత్తికి ఖాతా, పూత రాలేదు. ప్రస్తుతం పత్తి పంట 20 రోజుల్లో తీసివేసే దశకు చేరుకుందంటే అందులో ఎలాంటి అతిశయోక్తి లేదు. చివరి వరకు కనీసం ఎకరానికి ఆరు క్వింటాళ్లు కూడా మెండే అని రైతులు అంటున్నారు. ఈ లెక్కన పెట్టుబడి సైతం తమ చేతికి రాలేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు లక్షలపై చిలుకు ఎకరాల్లో ఈ సంవత్సరం పత్తిని సాగు చేస్తే ఇందులో తాంసి మండలంలో 36 వేల హెక్టార్లలో పత్తిని సాగు చేశారు. ప్రస్తుతం పత్తి ఏరుడు 95 శాతానికి చేరుకుంది. ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవడంతో పత్తి రైతు ఆందోళన చెందుతున్నారు.

మూడు నెలల ముందే పత్తికి కాలం చెల్లు..

ప్రతి సంవత్సరం మార్చి, ఏప్రిల్ నెల వరకు ఉండే పత్తి పంట ఈ ఏడు డిసెంబర్ రెండు లేదా మూడో వారానికి ముగియనుంది. దీంతో మూడు నెలలు ముందుగానే పత్తికి కాలం చెల్లినట్లు అవుతుందని రైతులు అంటున్నారు. రెండో పంట వేసుకుందాం అనుకుంటే భూగర్భంలో జలాలు పూర్తిగా అడుగంటి పోయాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండో పంట వేస్తే తమ పంటకు నీళ్లు అందుతాయో లేదోనని మదన పడుతున్నారు. దీంతో ఈ సంవత్సరం మూడు నెలల ముందుగానే పత్తి పంటను తొలగించాల్సి వస్తుందని రైతులు అంటున్నారు.

● పిండినల్లితో మరింత నష్టం

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సంవత్సరం పత్తి పంటపై పిండి నల్లి తెగులు సోకింది. దీంతో పచ్చగా ఉండాల్సిన పత్తి ఆకులన్నీ ఎండి బారిపోయాయి. దీని వల్ల కూడా తమకు తీవ్ర నష్టం వాటిల్లిందని పత్తి రైతులు చెబుతున్నారు.



● మార్కెట్‌లో గిట్టుబాటు ధర కరువు

ఎకరానికి కనీసం ఆరు క్వింటాళ్ల దిగుబడి రాకపోయినా మార్కెట్‌లో గిట్టుబాటు ధర కరువైందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సీసీఐ తేమశాతం నిబంధన విధించడం వల్ల చాలా మంది రైతులు ప్రైవేట్‌కు అమ్ముకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ప్రైవేట్ వ్యాపారస్తులు క్వింటాల్‌కు రూ. 6 వేల నుంచి 6,500 లోపే కొనుగోలు చేస్తున్నారని రైతులు అంటున్నారు. ఒక పక్క దిగుబడి రాక మరో పక్క గిట్టుబాటు లేక తాము ఈ సంవత్సరం చాలా నష్టపోయామని రైతులు అంటున్నారు.

● ప్రభుత్వమే ఆదుకోవాలి



ఈ సంవత్సరం తాము తీవ్రంగా నష్టపోయామని తమను ప్రభుత్వమే ఆదుకోవాలి. ఈ ఏడు పంటలకు అంతగా తెగులు సోకలేదు. కాని వర్షాలు సమృద్ధిగా లేకపోవడం వల్లే పత్తికి సరైన రీతిలో ఖాతా, పూత లేకుండా పోయింది. ప్రభుత్వం స్పందించి పత్తి రైతులకు ఏదైనా మేలు చేయాలి. - శాతల రవి, రైతు, తాంసి

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.5 । కనిష్ఠం 21.8

8
నిర్మల్
జిల్లా వార్తలు
ఆదివారం 1 డిసెంబరు 2024




లంచావతారులపై కొరడా



ఏసీబీకి పట్టుబడిన సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఉద్యోగులు (ఫైల్) | ..నిర్మల్ మున్సిపల్ ఉద్యోగి (ఫైల్) | పట్టుబడ్డ భైంసా మున్సిపల్ కమిషనర్, బిల్ కలెక్టర్ (ఫైల్) | ఏసీబీ డీఎస్పీ రమణా మూర్తి, సిబ్బంది (ఫైల్)

- జిల్లాలోని అవినీతి అధికారులపై ఏసీబీ ఉచ్చు
- ఏడాదిలోనే ఎనిమిది మందికి పైగా అక్రమార్కుల పట్టివేత
- వరుస సంఘటనలు జరుగుతున్నా ఉద్యోగుల్లో కనిపించని మార్పు
- ఇక మరింత పకడ్బందీగా నిఘా
- జిల్లాస్థాయిలో ఇన్‌ఫార్మింగ్ నెట్‌వర్క్
- అన్ని శాఖల్లోనూ పెరిగిపోతున్న లంచావతారులు



భైంసా మున్సిపల్ కార్యాలయంలో పట్టుబడ్డ నగదు (ఫైల్)

నిర్మల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని పలు ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న కొంతమంది అధికారులు, సిబ్బంది లంచావతారులుగా మారి అమాయక జనాన్ని జలగల్లా పీక్కుతింటున్నారు. రోజురోజుకు అక్రమార్కుల ఆగడాలు పెరిగిపోతున్నప్పటికి సంబంధిత శాఖల ఉన్నతాధికారులు మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. మొన్నటి వరకు లంచాలను రహస్యంగా తీసుకునే అధికారులు, సిబ్బంది క్రమంగా ఆ లంచాలను బహిరంగంగానే ఆఫీసులో అందరి ముందు వసూలు చేస్తుండడం ఇక్కడి అక్రమార్కుల ఆగడాలకు సాక్ష్యంగా చెబుతున్నారు. ఈ పదకొండు నెలల్లోనే దాదాపు ఎనిమిది మందికి పైగా లంచావతారులు ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారంటే ఇక్కడి లంచాల పరిస్థితి ఏ మేరకు దాటిపోయిందో అర్థం చేసుకోవచ్చని అంటున్నారు. ముఖ్యంగా రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, రిజిస్ట్రేషన్, మున్సిపాలిటీ, పౌరసరఫరాలశాఖ, రవాణాశాఖలతో పాటు మరికొన్ని శాఖల్లో బహిరంగంగానే లంచాల వ్యవహారం సాగుతోందన్న ఫిర్యాదులున్నాయి. బాధితుల అవసరాలను ఆసరాగా చేసుకుంటూ కొంతమంది ఉద్యోగులు మానవత్వాన్ని మరిచి లంచాలను ముక్కుపిండి వసూలు చేస్తుండడం విమర్శలకు తావిస్తోంది. అయితే జిల్లాలో కొనసాగుతున్న పలుశాఖల అవినీతిపైనా అలాగే లంచావతారులపైనా ఏసీబీ అధికారులు సీరియస్‌గా దృష్టి సారించడంతో రోజుకో గుట్టు బయటపడుతోంది. ఏసీబీ అధికారులు కొద్దిరోజుల నుంచి లంచాలకు వ్యతిరేకంగా విస్తృతస్థాయిలో ప్రచారం చేస్తూ అవగాహన కల్పించడంతో పాటు ఇన్‌ఫార్మింగ్ నెట్‌వర్క్‌ను కూడా నియమించుకున్నట్లు చెబుతున్నారు. బాధితులు కూడా క్రమక్రమంగా ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తూ లంచావతారులను ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టిస్తుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది.

వరుస సంఘటనలతో కూడా రాని మార్పు..

కాగా జిల్లావ్యాప్తంగా గత పదకొండు నెలల నుంచి పట్టుబడిన లంచాల కేసులు పెరిగిపోతున్నాయి. ఇప్పటి వరకు దాదాపు ఎనిమిది మందికి పైగా అధికారులు, ఉద్యోగులు ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. మొదట ఇక్కడి రిజిస్ట్రేషన్ ఆఫీసులో ఏసీబీ అధి కారులకు జూనియర్ అసిస్టెంట్ పట్టుబడ్డాడు. అలాగే జనవరి 10వ తేదీన కడెం తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌లు ఓ రైతు నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ వలకు చిక్కారు. నిర్మల్ మున్సిపాలిటీలో ఆర్‌ఓగా పనిచేస్తున్న గంగాధర్, బిల్ కలెక్టర్ నవంత్‌లు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. అలాగే భైంసా మున్సిపాలిటీలో సైతం కమిషనర్ వెంకటేశ్వర్‌రావు, బిల్ కలెక్టర్‌లు 30వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. కాగా కొద్దిరోజుల క్రితం మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్ పని చేస్తున్న షాకీర్‌ఖాన్ అనే ఉద్యోగి కూడా రూ. 17వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఈ సంఘటనలన్నీ మరువకముందే రెండు రోజుల క్రితం సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆఫీసులో బినామీ అటెండర్ ప్రశాంత్‌లు సైతం లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోయారు. ఇలా వరుస సంఘటనలు జరుగుతున్నప్పటికీ అధికారులు, సిబ్బంది మాత్రం ఎలాంటి భయం లేకుండా ముక్కుపిండి లంచాలు వసూలు చేస్తుండడంపై ఆయా శాఖల్లో కలకలం రేపుతోందంటున్నారు.

ఇన్‌ఫార్మింగ్ నెట్‌వర్క్ విస్తరణ..

కాగా జిల్లాలో రోజురోజుకు పెరిగిపోతున్న లంచాల వ్యవహారంపై ఏసీబీ అధికారులు సీరియస్‌గా దృష్టి సారించినట్లు చెబుతున్నారు. ఇక్కడి కొన్ని శాఖల్లో యథేచ్ఛగా అవినీతి, అక్రమాలు పెరిగిపోతున్నప్పటికి ఆ శాఖల ఉన్నతాధికారులు మాత్రం ఇటు వైపు దృష్టి సారించకపోతుండడం అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికే ఏసీబీ అధికారులు లంచాల వ్యవహారాలపై విస్తృతస్థాయిలో ప్రచారం చేస్తూ టోల్‌ఫ్రీ నంబర్‌ను సైతం అందుబాటులోకి తీసుకువచ్చారు. అలాగే జిల్లాస్థాయిలో ఇన్‌ఫార్మింగ్ నెట్‌వర్క్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు. దీని ద్వారా అక్రమార్కుల లంచాలపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తూ దాడులు చేసి పట్టుకుంటున్నారంటున్నారు. ఇందులో భాగంగానే బాధితుల ఫిర్యాదులపై తాము గోప్యంగా ఉంచుతామని అలాగే ఇన్‌ఫార్మర్‌ల సమాచార విషయంలో సైతం గోప్యత పాటిస్తామంటూ ఏసీబీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఏసీబీ అధికారులు శాఖల వారిగా లంచావతారుల జాబితాను రూపొందిస్తున్నారంటున్నారు. ఇప్పటి వరకు రెడ్‌హ్యాండెడ్ కేసులపై దృష్టి సారించిన ఏసీబీ అధికారులు ఇక అక్రమంగా ఆస్తులు కూడబెడుతున్న అధికారులు, ఉద్యోగులపై దృష్టి సారించనున్నట్లు సమాచారం.

బాసర ఆలయంలో కార్తీక దీపారాధన



బాసర ఆలయంలో వివిధ ఆకృతుల్లో దీపాలను వెలిగించిన భక్తులు



చిన్నారుల భరత నాట్య ప్రదర్శన

బాసర, నవంబర్, 30 : (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసాన్ని పురస్కరించుకొని బాసర సరస్వతీ దేవస్థానంలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు, కార్తీక దీపారాధనలు శనివారం నాటితో ముగిశాయి. చివరిరోజు హైదరాబాద్‌కు చెందిన విద్యార్థులు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. వివిధ భక్తి గీతాలపై చేసిన ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం అనంతరం కార్తీక దీపారాధన నిర్వహించారు. భక్తులు పాల్గొని దీపాలను వెలిగించి కార్తీక పూజలను నిర్వహించారు.

హరిహర క్షేత్రంలో నేటి నుంచి అన్నప్రసాద వితరణ

నిర్మల్ కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : హరిహరక్షేత్రంలో ఆదివారం నుంచి అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నట్టు ఆలయ గురుస్వామి మూర్తి తెలిపారు. ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ, మురళీధర్‌రెడ్డి సహాయ సహకారంతో నిర్వహించే కార్యక్రమానికి భక్తులు విరాళాలు అందించవచ్చునని తెలిపారు. వచ్చే నెల 13 వరకు అన్న వితరణ కొనసాగుతుందన్నారు. అయ్యప్ప స్వాములకు ఇళ్లలో బిక్ష సమర్పించ్చని భక్తులకు మంచి అవకాశమని కోశాధికారి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

- ట్రస్మా స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న శ్రీహరిరావు

నిర్మల్ కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రీడల్లో రాణించాలని డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు ఆకాంక్షించారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో శనివారం ట్రస్మా నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్ 2024 మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తులో విద్యా, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఈశ్వర్ మాట్లాడుతూ... క్రీడలు విద్యార్థుల్లో మానసిక, శారీరక అభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు ఏ. వెంకటేశ్వర్‌రావు, ట్రస్మా నాయకులు చంద్రగౌడ్, పద్మనాభగౌడ్, మంచిరాల నాగభూషణం, ప్రమోద్‌రావు, పతికే శ్రీనివాస్, అన్వర్, ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు, ప్రిన్సిపాళ్లు హాజరయ్యారు.

ఆస్తి పన్ను వసూలు వంద శాతం పూర్తి చేయాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆస్తిపన్ను వసూలు వంద శాతం పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్ శాఖ అధికారులతో అదనపు కలెక్టర్ పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతాల్లో వాణిజ్య, గృహ తదితర పన్నుల వసూలు త్వరితగతిన వంద శాతం పూర్తి చేయాలన్నారు. సకాలంలో పన్నులు చెల్లించని వారికి చట్ట ప్రకారం నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు వసూలు చేసిన పన్నులు, బకాయి పన్నులకు సంబంధించిన వివరాలను అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో నిరంతరం మెరుగైన పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనునిత్యం అన్ని విద్యుత్ దీపాలు సక్రమంగా వెలిగేలా పర్యవేక్షణ ఉండాలన్నారు. పట్టణ ప్రాంతాల్లోని అన్ని రకాల వ్యాపారస్తులు తప్పనిసరిగా వాణిజ్య లైసెన్స్‌లు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త మంచినీటి కుళాయిల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో నడుస్తున్న మహిళాశక్తి క్యాంటీన్ల నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్లు ఖమర్ అహ్మద్, మనోహర్, రాజేష్ కుమార్, మెప్మా పీడీ సుభాష్; శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు,

సింహగర్జనకు ఇంటింటి నుంచి మాలలు

- ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ ముథోల్ సెగ్మెంట్ అధ్యక్షులు శంకర్ చంద్రే



భైంసాలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ

భైంసా, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జాతి హక్కుల సాధన, ఆత్మగౌరవం కోసం గాను ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించే సింహగర్జన సభకు నియోజకవర్గ పరిధిలోని ఇంటింటి నుంచి మాలలు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధమయ్యారని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ ముథోల్ సెగ్మెంట్ అధ్యక్షులు శంకర్ చంద్రే వెల్లడించారు. శనివారం భైంసా డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సింహగర్జనకు మాలల తరలింపు పై సమీక్షా సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. సింహగర్జన ద్వారా జాతి సత్తా చాటేందుకుగాను మాలలంతా సన్నద్ధమయ్యారని పేర్కొన్నారు. నియోజక వర్గ పరిధి నుంచి ఇంటింటి నుంచి ఒకరు చొప్పున 5 వేలకు పైగా మాలలు సింహగర్జనకు తరలి రానున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భైంసాలోని బస్టాండ్ ఎదుట సింహగర్జన విజయవంతానికి ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ ప్రదర్శనలు చేపట్టింది. ఇందులో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ గౌరవ అధ్యక్షులు గంగాధర్ జాడే, ప్రధాన ప్రతినిధి గిరిధారీ జంగ్మే, కోశాధికారి రాజారాం, సోషల్ మీడియా ప్రతినిధి కాంబ్లే సాహెబ్‌రావ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

మాలల సింహ గర్జన విజయవంతం చేయండి



బాసర, నవంబర్, 30: (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని బాసర మండల అంబేద్కర్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి జీ. పద్మరావు కోరారు. శనివారం మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సమావేశం జరిగింది.

చారిత్రాత్మక ప్రదేశాలను అభివృద్ధి చేయాలి

శ్యామ్‌ఘడ్ కోట సందర్శనలో కలెక్టర్ అభిలాష అభినవ్



శ్యామ్‌ఘడ్ కోట వద్ద ఆదేశాలిస్తున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని చారిత్రాత్మక కట్టడాల వద్ద సుందరీకరణ అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని శ్యామ్‌ఘడ్ కోట, ధర్మసాగర్ చెరువు ప్రాంతాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... శ్యామ్‌ఘడ్ కోట వద్ద చేపట్టనున్న రోడ్డు వెడల్పు, విద్యుత్ దీపాల ఏర్పాటు, ఫుట్‌పాత్ నిర్మాణాలపై అధికారులకు సూచనలు చేశారు. పురాతన కట్టడాల సంరక్షణ బాధ్యత అందరిపై ఉందన్నారు. చారిత్రక ప్రదేశాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. దశల వారీగా అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. హైమాస్ లైట్లు ఏర్పాటు చేసి అసాంఘిక కార్యక్రమాలు జరుగకుండా చూడాలన్నారు. మినీ ట్యాంక్ బండ్‌గా పిలువబడుతున్న ధర్మసాగర్ చెరువును సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. మురికి నీరు చెరువులో కలువకుండా చూడాలన్నారు. వాహనాల పార్కింగ్ స్థలం గురించి పరిసర ప్రాంతాల్లో మెరుగైన పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్ అండ్ బి ఈఈ అశోక్ కుమార్, మున్సిపల్ డీఈ హరిభువన్, అర్బన్ తహసీల్దార్ రాజు, ఇతర అధికారులున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్



సమావేశానికి హాజరైన అధికారులు, తదితరులు

నిర్మల్ అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ వసతి గృహ ప్రిన్సిపాళ్లు, అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ వసతిగృహాల్లో చదివే ప్రతి విద్యార్థికి మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. మండలాల వారీగా వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య, అందిస్తున్న భోజన, వసతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన కూరగాయలు, సరుకులు మాత్రమే వంటకు వినియోగించాలన్నారు. కూరగాయల సరఫరాదారులు వసతి గృహాలకు నాణ్యమైన కూరగాయలు, చికెన్, మటన్, కోడిగుడ్లు, అరటి పండ్లు, పాలు ఇతర సరుకులను సరఫరా చేయాలన్నారు. సరఫరాదారులు అందించిన వస్తువుల నాణ్యతను ప్రిన్సిపాళ్లు పరిశీలించాలని, వస్తువుల నాణ్యత సరిగా లేనట్లయితే వాటిని తిరిగి వెనక్కి పంపించాలని సూచించారు. కుళ్లిన, నిల్వ ఉంచిన కూరగాయలు, చికెన్, మటన్, కోడిగుడ్లను ఎట్టి పరిస్థితుల్లోను వంటకు ఉపయోగించరాదన్నారు. కూరగాయలను నేరుగా నేలమీద ఉంచకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, వంటకు ముందు కూరగాయలను ఉప్పు నీటితో కడగాలని సూచించారు. వంట గది, స్టోర్‌రూమ్, డైనింగ్‌హాల్‌ను ప్రతీరోజు శుభ్రపరచుకోవాలన్నారు. వంట సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, వంటకు ముందు చేతులు, కాళ్లను పరిశుభ్రంగా కడుక్కోవాలన్నారు. వంట చేసే సమయంలో తప్పనిసరిగా హెడ్ క్యాప్, మాస్క్, ఆప్రాన్ ధరించాలని, వంట పాత్రలను డిష్ వాషర్లతో శుభ్రపరచాలన్నారు. విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీటిని మాత్రమే అందించాలన్నారు. బియ్యం, పప్పు దినుసులను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. వంట సరుకులు వసతి గృహానికి రాగానే వస్తువుల గడువు తేదీని రిజిస్టర్‌లో నమోదు చేసి ఎప్పటికప్పుడు తనిఖీ నిర్వహించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గడువు తీరిన వస్తువులను వంటకు ఉపయోగించరాదని తెలిపారు. మరుగుదొడ్లను, వసతిగృహ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షిస్తూ, విద్యార్థులు, ఉపాధ్యాయులతో మెస్ కమిటీలు నిర్వహించాలన్నారు. షిఫ్టుల వారీగా ఉపాధ్యాయులు వసతిగృహాల్లో బస చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు ఉంటాయని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్సీ సంక్షేమ అధికారి రాజేశ్వర్‌గౌడ్, డీటీడీవో అంబాజీ, ప్రిన్సిపాళ్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీతో పోలీసులు విధులు నిర్వహించాలి

ఎస్పీ జానకీ షర్మిల



నిర్మల్ కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా జిల్లాకు నియమితులైన పోలీసులు నీతి నిజాయితీతో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని ఎస్పీ జానకి షర్మిల సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న 137 మంది పోలీసులు శనివారం విధుల్లో చేరారు. 67 మంది సివిల్, 36 మహిళా, 30 సాయుధ, 6 సాయుధ పోలీసులు జిల్లా కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ... సమాజానికి అత్యున్నతమైన సేవలందించే అవకాశం పోలీసులకు ఉందన్నారు. అప్పగించిన బాధ్యతలు చిత్తశుద్ధితో నెరవేర్చాలన్నారు. ప్రజల రక్షణ పోలీసుల బాధ్యత అన్నారు. వారి హక్కులకు భంగం కలుగకుండా ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. క్రమ శిక్షణ అన్నింటి కంటే ముఖ్యమైందని గుర్తుంచుకోవాలన్నారు. ప్రలోభాలకు గురికావద్దని, ఆరోపణలు లేకుండా విధులు నిర్వహిస్తే ప్రజలు హర్షిస్తారని స్పష్టం చేశారు. అదనపు ఎస్పీ సూర్యనారాయణ, ఏవో యూనిస్ అలీ, సూపరెండెంట్ శ్రీనివాస్, ఆర్ఐ రామ్ నిరంజన్, రమేష్, ఎస్సై జ్యోతి, ఆర్ఎస్సై రవి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి 30 పోలీసు చట్టం అమలు

నిర్మల్ కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆదివారం నుంచి ఈ నెల 31 వరకు 30 పోలీస్ చట్టం అమలు చేయనున్నట్టు ఎస్పీ జానకి షర్మిల ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ అధికారుల ముందస్తు అనుమతులు లేకుండా ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన, ప్రజా ధనానికి నష్టం వాటిల్లిన, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు, పార్టీ ప్రతినిధులు సహకరించాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక : డీఈవో

నిర్మల్ కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచ పోటీల్లో నిర్మల్ జిల్లాలోని ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు డీఈవో రామారావు తెలిపారు. సోఫీనగర్ గురుకుల పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వీరు ఈ నెల 3న హైదరాబాద్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు. శనివారం జిల్లాస్థాయిలో విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. సస్మిక, ఏజ జయేంద్ర, ఉదయ్‌కిరణ్ రాష్ట్రస్థాయికి ఎంపికైన వారిలో ఉన్నారు. పరీక్షల అధికారి పద్మ, డానియల్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 9 మంది డిబార్

భైంసా, నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి) ; పట్టణంలోని గోపాల్‌రావు పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో కాపీయింగ్‌కు పాల్పడుతున్న తొమ్మిది మంది విద్యార్థులు శనివారం పట్టుబడ్డారు. కళాశాల చీఫ్ సూపరిండెంట్ కర్రోల్ల బుచ్చయ్య పరీక్షలు తనిఖీలు నిర్వహిస్తుండగా.. కాపీయింగ్‌కు పాల్పడుతున్న తొమ్మిది మంది విద్యార్థులను పట్టుకున్నారు. ఉదయం పరీక్షలో ఒక విద్యార్థి, మధ్యాహ్నం జరిగిన పరీక్షలో ఎనిమిది మంది విద్యార్థులు పట్టుబడ్డారు. అయితే పరీక్షలు ప్రారంభమైన తొలి రోజు శుక్రవారం ముగ్గురు విద్యార్థులు, శనివారం తొమ్మిది మంది విద్యార్థులు, మొత్తం 12 మంది విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడుతు పట్టుబడ్డారు.

3న సీనియర్ మహిళల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు

భైంసా, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 3న రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని వేదం తపోవన్ ఉన్నత పాఠశాలలో జిల్లా సీనియర్ మహిళల కబడ్డీ (75 కిలోల లోపు) జట్ల ఎంపిక కోసం పోటీలు నిర్వహిస్తున్నట్లుగా జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి బి.సునిల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తిగల క్రీడకారులు తమ తమ ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫోటో తీసుకొని మంగళవారం ఉదయం 11 గంటలకు వేదం తపోవన్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో కె.సునిల్ (పీఈటీ) సెల్ నెంబర్ 6301843139, ఎస్.ప్రేమల (పీడీ)సెల్ నెంబరు 9908970203లను సంప్రదించాలని సూచించారు.

సీసీ రోడ్డు పనులను చేపట్టాలి

ముథోల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోత) : మండల కేంద్రమైన ముథోల్‌లోని మహాలక్ష్మి ఆలయం నుండి గాంధీ చౌక్ వరకు వెంటనే సీసీ రోడ్డు పనులు చేపట్టాలని ముథోల్ మండల బీజేపీ అధ్యక్షుడు కోరి పోతన్న శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్డు మంజూరు కావటంతో సదరు కాంట్రాక్టర్ పాత రోడ్డును తొలగించి రోజులు గడుస్తున్నా పనులు ప్రారంభించకపోవడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. దీంతో రోడ్డు గుండా వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు గాయాలపాలవుతున్నారని ఆయన పేర్కొన్నారు. అనునిత్యం ఈ రోడ్డు ప్రజలతో రద్దీగా ఉంటుందని, ఇప్పటికైనా వెంటనే సీసీ రోడ్డు పనులను ప్రారంబించాలని కోరారు.